## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు మార్గం సుగమమైంది. శాసన సభ, మండలి ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ బిల్లునకు గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ఏప్రిల్ 9న ఆమోదం తెలిపారు. ఎస్సీ ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించి 15% రిజర్వేషన్ కల్పించేలా ఈ బిల్లును ఆమోదించి చట్టం చేశారు.

## రోజులు-ప్రాధాన్యం

### ఏప్రిల్ 10

- ప్రపంచ హోమియో రోజుగా ఏప్రిల్ 10న నిర్వహిస్తారు. ఈ వైద్య విధానాన్ని ప్రవేశపెట్టిన డాక్టర్ శామ్యూల్ హానెమన్ జయంతి సందర్భంగా హోమియోపతి రోజు చేపడతారు.

### ఏప్రిల్ 7

- ప్రపంచ ఆరోగ్య రోజుగా ఏప్రిల్ 7న నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'హెల్తీ బిగినింగ్స్, హోప్‌ఫుల్ ఫ్యూచర్స్ (ఆరోగ్యవంతమైన ప్రారంభం, ఆశాజనకంగా భవిష్యత్తు)'. 1948లో ఏప్రిల్ 7న జెనీవా కేంద్రంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పడినందున ఈ రోజును ఆరోగ్య రోజుగా నిర్వహిస్తున్నారు.

### ఏప్రిల్ 6

- ఏటా ఏప్రిల్ 6న క్రీడల అభివృద్ధి-శాంతి కోసం అంతర్జాతీయ క్రీడల రోజుగా నిర్వహిస్తారు. 1896లో తొలిసారి ఆధునిక ఒలింపిక్స్ ఏప్రిల్ 6న ప్రారంభమయ్యాయి. దీంతో ఈ రోజును ఎంపిక చేశారు. ఈ ఏడాది ఇతివృత్తం 'లెవలింగ్ ది ప్లేయింగ్ ఫీల్డ్: స్పోర్ట్ ఫర్ సోషల్ ఇన్‌క్లూజన్'.

### ఏప్రిల్ 5

- ఏటా ఏప్రిల్ 5న సమతా దివస్‌గా నిర్వహిస్తారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఆ రోజు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెహ్రూ క్యాబినెట్‌లో పనిచేసిన అత్యంత పిన్న వయస్కుడు అతడు. అలాగే రక్షణ శాఖ మంత్రిగా, రైల్వే శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా కూడా విధులు నిర్వహించారు.

## అంతర్జాతీయం

### ఐఎస్ఏఆర్

- ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ అకౌంటింగ్ అండ్ రిపోర్టింగ్ అనే వ్యవస్థకు 2025-27కు భారత్ ఎంపికయ్యింది. ఆర్థిక స్థిరత్వంతో పాటు పెట్టుబడుల ఆకరర్షణ, ప్రపంచ ఆర్థిక రంగంలో సహకారం పెంపొందించేందుకు ఉద్దేశించిన సంస్థ ఇది. 34 దేశాలకు ఇందులో సభ్యత్వం ఉంది. ఇందులో తొమ్మిది ఆఫ్రికన్ దేశాలు, ఏడు ఆసియా దేశాలు, ఆరు లాటిన్ అమెరికా దేశాలు, మూడు తూర్పు యూరప్ దేశాలు, తొమ్మిది పశ్చిమ యూరప్, ఇతర దేశాలకు సభ్యత్వం ఉంది. ఈ సంస్థను ఆర్థిక-సామాజిక మండలి 1983లో ఏర్పాటు చేసింది. యూఎన్‌సీటీఏడీ సమన్వయం చేస్తుంది.

### రాష్ట్రపతి విదేశీ పర్యటన

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల పోర్చుగల్, స్లొవేకియా దేశాల్లో పర్యటించారు. భారత్, పోర్చుగల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు 50 సంవత్సరాలు పూర్తయ్యాయి.



పోర్చుగీస్ రాజధాని లిస్బన్‌కు వెళ్లారు. అక్కడ ఆమెకు 'సిటీ కీ ఆఫ్ ఆనర్' అనే అవార్డ్ అందజేశారు. అనంతరం స్లొవేకియాలో పర్యటించారు. ఎంఎస్ఎంఈ, విదేశీ సేవల అంశం విషయంలో రెండు ఒప్పందాలు కుదిరాయి. అలాగే స్లొవేకియా పురస్కారం 'కాన్‌స్టంటిటన్ ది ఫిలాసఫర్ యూనివర్సిటీ ఇన్ నిత్ర' రాష్ట్రపతికి ప్రదానం చేశారు.

### ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్

- దేశంలోని ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ వంటి నియంత్రణ సంస్థలకు మరింత స్వయంప్రతిపత్తి కల్పించి బలోపేతం చేయాలని ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో సూచించాయి.

### ఐపీయూ

- జెనీవా కేంద్రంగా ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ పనిచేస్తుంది. ఈ సంస్థకు సంబంధించిన 150వ సమావేశం ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్‌లో ఏప్రిల్ 5 నుంచి 9 వరకు నిర్వహించారు. బెలిజ్ ఈ కూటమిలో తాజాగా చేరింది. దీంతో మొత్తం సభ్య దేశాల సంఖ్య 182కు పెరిగింది. భారత్ తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పాల్గొన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే భారతదేశం ప్రస్తుతం సామాజిక న్యాయం, సమానత్వాన్ని సాధించే దిశగా వేగంగా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు.

### 3డీ రైల్వే స్టేషన్

- ప్రపంచంలోనే తొలిసారి 3డీ ప్రింటెడ్ రైల్వే స్టేషన్‌ను జపాన్‌లోని అరిడా నగరంలో నిర్మించారు. కేవలం ఆరు గంటల్లో ఈ



ప్రక్రియ పూర్తయ్యింది. ఆ దేశానికి చెందిన వెస్ట్ జపాన్ రైల్వే కంపెనీ దీన్ని అందుబాటులోకి తెచ్చింది.

### భారత్-నేపాల్

- న్యాయ అంశాల్లో పరస్పర సహకారానికి భారత, నేపాల్ దేశాల సర్వోన్నత న్యాయస్థానాలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ తరహా ఒప్పందం భారత సుప్రీంకోర్ట్ గతంలో ఇజ్రాయెల్, సింగపూర్, బంగ్లాదేశ్‌లతో కూడా కుదుర్చుకుంది.

### అమెరికా

- అనేక దేశాలపై అమలు కావాల్సిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటి వరకు గతంలో ఉన్న 10% మాత్రమే విధిస్తారు. చైనాపై మాత్రం సుంకాలు కొనసాగుతాయి. ఆ దేశంపై సుమారు 125% విధించారు. మరోవైపు చైనా కూడా అమెరికాపై 84% సుంకాలను విధించింది. అలాగే యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రపంచ దేశాలకు చేసే సాయాన్ని ట్రంప్ ప్రభుత్వం నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీన్ని పునరుద్ధరించారు. ఎందరో పేదల ఆకలి మరణాలకు సాయం నిలిపివేత నిర్ణయం దారి తీయొచ్చని వార్తలు వచ్చిన నేపథ్యంలో ముందుగా ప్రపంచ ఆహార కార్యక్రమానికి సాయాన్ని ప్రారంభించారు.

## ఆర్థికం

### ద్రవ్య విధానం

- రెపోరేట్‌ను 25% ఆర్‌బీఐ తాజా ద్రవ్య విధానంలో తగ్గించింది. దీంతో ప్రస్తుతం ఆ రేట్ 6% ఉంది. అలాగే 2025-26 సంవత్సరానికి భారత్ 6.5% వృద్ధి రేటును సాధిస్తుందని ఆర్‌బీఐ అంచనా వేసింది.

### జస్పే

- 2025లో తొలి యూనికార్న్‌గా నిలిచిన సంస్థ జస్పే. బెంగళూర్ కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తుంది.

### నీటి నిర్వహణ అధునికీకరణ

- కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ అనే పథకం అమలుకు రూ. 1600 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి కృషి సించయ్ యోజన పథకంలో ఇది ఒక ఉప పథకంగా ఉండనుంది. వ్యవసాయ పొలాలకు నీటిని అందించాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా మెరుగైన నీటి నిర్వహణ పద్ధతిని చేపట్టనున్నారు.

## వార్తల్లో వ్యక్తులు

### రాజేష్ ఉన్ని

- సినర్జీ మెరైన్ గ్రూప్ వ్యవస్థాపకుడు రాజేశ్ ఉన్నికి నేషనల్ మారిటైం వరుణ అవార్డ్ దక్కింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఈ అవార్డ్‌ను అందించింది. మారిటైం రంగంలో పౌరులకు ఇచ్చే అత్యున్నత అవార్డ్ ఇది.

### సురుచి ఇందర్ సింగ్


- అర్జెంటీనాలో నిర్వహిస్తున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ పోటీలో సురుచి ఇందర్ సింగ్ బంగారు పతకాన్ని సాధించింది. మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఆమె అగ్రస్థానంలో నిలిచింది.



## జాతీయం

### యూఏఈ

- యూఏఈ యువ రాజు షేక్ హమ్‌దన్ బిన్ మహ్మద్ భారతదేశంలో అధికారిక పర్యటన చేశారు. రక్షణ రంగంతో పాటు వాణిజ్య సంబంధాల పెంపునకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. తీర రక్షక దళాల మధ్య పరస్పర సహకారానికి అంగీకారం కుదరడంతో పాటు భారత్‌లోని ప్రతిష్ఠాత్మక ఐఐఎం అహ్మదాబాద్ సంస్థను దుబాయ్‌లో ప్రారంభించనున్నారు. అలాగే దుబాయ్‌లో యూఏఈ-ఇండియా ఫ్రెండ్‌షిప్ ఆస్పత్రిని కూడా నిర్మించనున్నారు.



### వక్ఫ్ బిల్లు

- వక్ఫ్ చట్టం ఏప్రిల్ 8న అమల్లోకి వచ్చింది. ఉభయ సభలు ఆమోదించిన ఈ బిల్లుకు రాష్ట్రపతి ఏప్రిల్ 5న ఆమోదం తెలిపారు. ఈ బిల్లును యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా ప్రవేశపెట్టారు. తొలిసారి వక్ఫ్ చట్టం 1954లో తీసుకొచ్చారు. 1995లో ఒకసారి, 2013లో మరోసారి సవరించారు. మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకే బిల్లును ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

### క్లైమేట్ సెంటర్

- జమ్ములోని ఉధంపూర్‌లో నాథాటాప్ వద్ద హిమాలయన్ హై-ఆల్టిట్యూడ్-అట్మాస్ఫియరిక్ క్లైమేట్ సెంటర్‌ను ప్రారంభించారు. దీంతో దేశంలో ఎత్తయిన ప్రదేశాల్లో వాతావరణ పరిస్థితుల సమాచారాన్ని సమగ్రంగా ఇచ్చేందుకు తొలిసారి ఈ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎత్తయిన ప్రదేశాల్లో వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఇది ఉపయోగపడనుంది.




### ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల్లో మార్పు

- విదేశాల నుంచి విరాళాల నియంత్రణకు సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి కేంద్ర హోం శాఖ సవరణలు చేసింది. విరాళాలను తీసుకున్న నాటి నుంచి నాలుగు సంవత్సరాల్లోగా వ్యయం చేయాలని నిబంధన విధించింది. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేటింగ్ చట్టాన్ని 1976లో చేశారు. తర్వాత 2010లో ఒకసారి, 2020లో మరోసారి సవరించారు.

### ఇండియా స్కిల్స్ యాక్సిలరేటర్

- ప్రపంచ ఆర్థిక ఫోరం సంస్థతో కలిసి ఇండియా స్కిల్ యాక్సిలరేటర్‌ను కేంద్రం నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. యువతకు నైపుణ్యతలో శిక్షణ ఇస్తుంది. ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో 65% సంస్థలు యువతకు నైపుణ్యలేమి ఉందన్న విషయాన్ని తెలపడంతో ఆ లోటును భర్తీ చేసేందుకు కేంద్రం నైపుణ్య శిక్షణను ఇవ్వనుంది.

## తెలంగాణ

### ముఖ గుర్తింపుతో పింఛన్లు

- రాష్ట్రంలో ముఖ గుర్తింపు విధానం ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తుంది. దీన్ని వచ్చే నెల లేదా జూన్ నుంచి ప్రారంభించవచ్చు. ఆసరా పథకం కింద రాష్ట్రంలో 42.96 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారు.

### శశికళకు గౌరవ ఫెలోషిప్

- గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యురాలు డాక్టర్ ఎం శశికళ 2024కు ప్రతిష్ఠాత్మక అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ గౌరవ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు.

### ఎస్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్ నియామకం

- తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. చైర్‌పర్సన్‌గా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్త కోట సీతా దయాకర్ రెడ్డి, సభ్యులుగా కంచర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, అపర్ణ గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్‌కుమార్ నియమితులయ్యారు.

### కొత్తగూడెంలో విశ్వవిద్యాలయం

- రాష్ట్రంలో మరో నూతన విశ్వవిద్యాలయం



రానుంది. కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం తాజాగా జీవో నంబర్ 20ని జారీ చేసింది. 2016లో న్యాక్ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్ఎస్ ప్రసాద్ చైర్మన్‌గా ఉన్న కమిటీ కొత్తగూడెం కళాశాలను సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులు ఉండేలా వర్సిటీగా మార్చాలని సిఫారసు చేసింది.

### పురోగతిలో తెలంగాణ పంచాయతీలు

- సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో 2023, ఫిబ్రవరి 22 నాటికి దేశంలోని గ్రామ పంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసిన పంచాయతీ పురోగతి సూచికలో తెలంగాణ దేశంలో రెండో స్థానంలో నిలిచింది. పేదరిక నిర్మూలన, పంచాయతీల్లో జీవనోపాధి పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు



అనుకూలమైన సౌకర్యాల కల్పన, తాగు నీరు, పారిశుద్ధ్యం, పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూలమైన విధానాలు అనే తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయతీల పనితీరు మదింపు చేశారు. రాష్ట్రాలను అచీవర్స్, ఫ్రంట్ రన్నర్, పెర్ఫామర్, యాస్పిరెంట్, బిగినర్ అని విభజించారు. దేశంలో ఏ పంచాయతీకి అచీవర్స్ హోదా దక్కలేదు. ఫ్రంట్ రన్నర్ విభాగంలో గుజరాత్‌లో 346, తెలంగాణలో 270 పంచాయతీలు 'ఎ' గ్రేడ్ దక్కించుకున్నాయి.

### ప్రీప్రైమరీ

- రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు కొనసాగుతున్నాయి.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

